

అంగన్‌వాడీలకు.. మహర్దశ


మూసాపేటలో రంగులు వేసిన అంగన్‌వాడీ కేంద్రం

- పూర్వ ప్రాథమిక పాఠశాలగా పేరు మార్పు
- నూతన విద్యా విధానం పాలసీ ఏర్పాటు
- టీచర్లకు పూర్తయిన శిక్షణ
- పిల్లలకు అందించనున్న యూనిఫామ్స్
- సీఎం చేతుల మీదుగా త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఆగస్టు 10: అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. వాటి రూపు రేఖలు మారనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్న వాటి పేరును పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చనున్నారు. కేంద్రాలకు ఆకర్షణీయంగా రంగులు వేయడంతో పాటు అందులో చదివే విద్యార్థులకు ఇకపై ఏకరూప దుస్తులు ఇవ్వనున్నారు. విద్యావిధానంలో కూడా కొత్త పాలసీకి శ్రీకారం చుట్టారు. పూర్వ ప్రాథమిక విద్య విధానంలో మార్పులు చేయడంతో పాటు ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. అందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మొత్తంగా అంగన్‌వాడీ విద్యలో విప్లవాత్మకమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఏకరూప దుస్తులు అందజేత

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 51,020 మంది పిల్లలు చదువుకుంటున్నారు. మొత్తం కేంద్రాలు 1,185కి గాను ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్నవి, స్వంత భవనాలు ఉన్నవి 97 ఉన్నాయి. ముందుగా వాటిని ఎంపిక చేసి, అందులో చదివే 7,774 మంది పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయనున్నారు. బాలికలకు స్కర్టు, బాలురకు షర్టు, నిక్కర్ ఇవ్వనున్నారు.

నూతన విద్యావిధానం

అంగన్‌వాడీ కేంద్రాలలో ఇదివరకు అక్షరాలు నేర్పించి, ఎక్కువగా ఆటలు ఆడించేవారు. కొత్తగా పూర్వ ప్రాథమిక విద్యా పాలసీని రూపొందించారు. న్యూట్రీషియన్, ప్లే స్కూల్, కరిక్యులమ్ పాఠ్యాంశాలు, ప్రాథమిక బాల్యం సంరక్షణ గురించి బోధించనున్నారు. విద్యను అందరికీ అందించే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించారు. ప్రతీ మూడు నెలలకోసారి సిలబస్‌ను రూపొందించి నాణ్యమైన ప్రాథమిక విద్యను పిల్లలకు అందించనున్నారు.

పేరు మార్పు...

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 1,185 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఐదేళ్ల వయస్సున్న పిల్లలను ఈ కేంద్రాల్లో చేర్పించి, విద్యను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పేరును పూర్వ ప్రాథమిక పాఠశాలల మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్డులను తయారు చేయించారు.

ఆకర్షణీయంగా అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మారనున్నాయి. పాత భవనాలకు రంగులు వేసి, ఆకర్షణీయంగా మారనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 20 కేంద్రాలకు రంగులు వేస్తున్నారు. గోడలపై పిల్లలను ఆకర్షించేలా బొమ్మలు వేస్తున్నారు. ప్రైవేటు నర్సరీ పాఠశాలల మాదిరిగా తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దాతలు ముందుకొస్తే మిగతా వాటికి కూడా రంగులు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



అందించనున్న యూనిఫామ్స్



అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల పేరుతో ఏర్పాటు చేయనున్న బోర్డులు

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

పూర్వ ప్రాథమిక విద్యా విధానం పాలసీలో భాగంగా జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముందుగా జిల్లా కోఆర్డినేటర్, మరో 10 మందితో ఒక గ్రూపును తయారు చేసి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారి ద్వారా జిల్లాలోని 1150 మంది అంగన్‌వాడీ టీచర్లకు గత జూన్ 15 నుంచి జూలై 13 వరకు శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకొని నూతన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

త్వరలో ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రాలపై ఇదివరకు కొంత చిన్నచూపు ఉండేది. కలెక్టర్ విజయేందిర బోయి సహకారంతో కేంద్రాలకు మహర్దశ రానుంది. కలెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి తమకు బడ్జెట్ కూడా కేటాయించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల పనులు పూర్తయ్యాయి. త్వరలో సీఎం చేతుల మీదుగా రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తేదీలు ఇంకా ఖరారు కాలేదు. మేము మాత్రం ప్రారంభానికి అన్ని సిద్ధం చేసి పెట్టుకున్నాం.

- జరీనా బేగం, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి

ప్యానల్ బోర్డు రాక

- మార్కండేయ లిఫ్ట్ ద్వారా ఎత్తిపోయనున్న నీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- గత ఎన్నికల ముందు అద్దె ప్యానల్ బోర్డుతో మోటార్ల ప్రారంభం
- పర్మినెంట్ ప్యానల్ బోర్డు తెప్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ
- ఈనెల 15 లోపు నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు


లారీలో వచ్చిన ప్యానల్ బోర్డు

బిజినేపల్లి, ఆగస్టు 10: ప్యానల్ బోర్డు రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి గ్రామ సమీపంలోని మార్కండేయ లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోయనున్నారు. కేఎల్‌ఐ కాల్వ ద్వారా 15 రోజులుగా నీరు పారుతున్నా.. ప్యానల్ బోర్డు లేకపోవడంతో మార్కండేయ లిఫ్ట్ పని చేయడం లేదు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే సంబంధిత గుత్తేదారులను పిలిపించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఓట్ల కోసం మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అద్దె ప్యానల్ బోర్డు తెప్పించి మోటార్లు ఆన్ చేశాడే తప్ప రైతుల మీద ప్రేమతో కాదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ విమర్శించారు. వెంటనే ప్యానల్ బోర్డు తెచ్చి, రైతులకు నీళ్లు ఇవ్వాలని గుత్తేదారులను వారు ఆదేశించారు. ప్యానల్ బోర్డులు శనివారం రావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15 లోపు ప్యానల్ బోర్డు బిగించి, మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తామని గుత్తేదారులు తెలిపారు.

ఐదు గ్రామాలు, 15 తండాలకు లబ్ధి


మార్కండేయ ఎత్తిపోతల పథకం

మార్కండేయ లిఫ్ట్ ప్రారంభమైతే బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, గంగారం, లట్టుపల్లి, పోలేపల్లి గ్రామాలతో పాటు 15 తండాలకు తాగు, సాగునీటి అవసరాలు తీరుతాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మార్కండేయ లిఫ్టును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అర టీఎంసీ నీటిని ఎత్తిపోసే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.77 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పనులు పూర్తి చేయకుండానే.. 2023 నవంబరులో అసెంబ్లీ ఎన్నికల ముందు మోటార్లు ఆన్ చేశారు. ఆరు నెలల్లో పనులు చేస్తానని చెప్పినా.. నత్తనడకన పనులు సాగడంతో ఇప్పటికీ పూర్తి కాలేదు.

సంతోషంగా ఉంది

ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి కృషితోనే మార్కండేయ లిఫ్ట్ మోటార్లు ప్రారంభించేందుకు ప్యానల్ బోర్డు తేవడం సంతోషంగా ఉంది. కేఎల్‌ఐ కాలువ ద్వారా 15 రోజులుగా నీళ్లు పారుతున్నా మార్కండేయ లిఫ్ట్ మోటర్ల ద్వారా నీటి పంపింగ్ ప్రారంభించ లేదు. ఈసారి కూడా పొలాలు బీడు పెట్టుకోవాల్సి వస్తుందని బాధపడ్డాం. ఎట్టకేలకు ప్యానల్ బోర్డు రావడంతో నీటిపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

- మస్కూరి అవంతి, మాజీ సర్పంచ్, శాయిన్‌పల్లి

90 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

- వరద కారణంగా దిగువ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేత

ఆత్మకూరు, ఆగస్టు 10: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి 90 మిలియన్ యూనిట్లకు చేరుకుందని ప్రాజెక్టు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. గడిచిన 24 గంటల్లో ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 2.254 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కొనసాగగా, ఇప్పటి వరకు 57.939 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో 15 రోజుల నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపేశామని చెప్పారు. ఇక్కడ ఇప్పటి వరకు 32.995 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మాత్రమే కొనసాగిందని తెలిపారు. వరద తగ్గుముఖం పడితే దిగువ జూరాలలో కూడా ఆరు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.


దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

కృష్ణమ్మ సోయగాలు..



చుట్టూ కొండలు, అడవితో కనువిందు చేస్తున్న సోమశిల


సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య పారుతున్న కృష్ణానది

ప్రకృతి అందాలకు నెలవైన సోమశిల పర్యాటకులను ఆకర్షిస్తోంది. చుట్టూ నది ఉండి.. మధ్యలో ద్వీపంలా కనిపిస్తూ విశేషంగా ఆకట్టుకుంటోంది. వరద జలాల రాకతో కృష్ణానది సోయగాలు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు లాంచీలో నదిపై విహరిస్తూ.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమశిల-సిద్దేశ్వరం కొండల మధ్య పారుతున్న కృష్ణానదిని చూసి పులకించి పోతున్నారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటేజీలలో ఉంటూ, ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. చేపల వంటకాలను ఆరగిస్తున్నారు.


- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్స్, మహబూబ్‌నగర్/వనపర్తి


లాంచీలో నదిపై విహరిస్తున్న పర్యాటకులు


లాంచీలోంచి నది అందాలను చూస్తున్న పర్యాటకులు


ఫొటోలు దిగుతున్న పర్యాటకులు


చుట్టూ నీటితో ద్వీపంలా కనిపిస్తున్న సోమశిల


నదిలో పుష్కర ఘాట్ల వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు


నిండుకుండలా కృష్ణానది

తండ్రిని చంపిన తనయుడు


సుల్తాన్ (ఫైల్)

తెలకపల్లి, ఆగస్టు 10: మద్యం మత్తులో జులాయిగా తిరుగుతూ కన్న తండ్రిని అతి కిరాతకంగా కొడుకు హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గట్టునెల్లికుదురుకు చెందిన బింగి మల్లేష్ చెడు వ్యసనాలతో పాటు మద్యానికి బానిసై ఎలాంటి బాధ్యత లేకుండా పని చేయకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతుండేవాడు. శుక్రవారం రాత్రి కొడుకు మల్లేష్‌ను తండ్రి బింగి సుల్తాన్ (52) మద్యం మానాలని, బాధ్యతగా పని చేసుకోవాలని మందలించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న మల్లేష్ ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న తండ్రి బింగి సుల్తాన్‌పై అతి కిరాతకంగా గొడ్డలితో ఎదపైన, గొంతుపైన నరికి చంపాడు. మృతుని భార్య బింగి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ హత్యతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య


నాగశ్రీ(ఫైల్)

మహబూబ్‌నగర్, ఆగస్టు 10: ఉరి వేసుకొని ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌కు చెందిన అబ్బ నరేందర్(26) ఐదేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు వచ్చి హిజ్రాగా మారాడు. ఝాన్సీనగర్‌లో నివాసం ఉంటోంది. నాగశ్రీ పేరుతో భిక్షాటన చేస్తూ, జీవనం సాగిస్తోంది. ఏడాది క్రితం పాత పాలమూరుకు చెందిన రమేశ్‌ను పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. శనివారం తెల్లవారుజామున రెండు గంటలకు రమేశ్ లక్ష్మయ్యకు ఫోన్ చేసి, నాగశ్రీ ఉరేసుకుని చనిపోయినట్లు చెప్పాడు. లక్ష్మయ్యతో పాటు కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని మార్చురీకి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. నాగశ్రీ మృతికి రమేశ్‌పై అనుమానాలున్నాయని లక్ష్మయ్య టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చోరీ కేసుల్లో నిందితుల రిమాండ్

నారాయణపేట టౌన్, ఆగస్టు 10 : నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు పళ్లవీధి, ధన్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాల కేసులను ఛేదించినట్లు డీఎస్పీ ఎన్.లింగయ్య తెలిపారు. నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పై వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. నారాయణపేట శాసన్‌పల్లి రోడ్ మార్గంలో ఉన్న భారత్‌గ్యాస్ ఏజెన్సీలో ఈనెల ఎనిమిదిన రాత్రి 25 గ్యాస్ సిలిండర్లను దొంగలించిన వ్యక్తి గాంధీనగర్‌కు చెందిన నగిరి ఆనంద్‌గా గుర్తించినట్లు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం నారా యణపేట పళ్ల వీధిలో ఇంట్లో వ్యక్తుల ఆరోగ్యం బాగుచేస్తానని మాయమాటలు చెప్పి పూజలు చేసి మోసపూరితంగా ఇత్తడి శివుని విగ్రహంతో పాటు మరికొన్ని వస్తువులను తీసుకొని మోసం చేసిన ఘటనపై గతంలో కేసు నమోదు కాగా జిల్లా కేంద్రంలోని బారంబావి కుంటకు చెందిన గజ్జెలి నరేష్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈయన నుంచి రూ.40 వేల విలువ చేసే విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నారాయణపేట మండలం బైరంకొండ గ్రామానికి చెందిన చాపలి విజయలక్ష్మి ఇంట్లో ఈనెల ఏడో తేదీన చోరీ జరిగిందని ఈ చోరీకి పాల్పడింది నారాయణపేట మండలం జాజాపూర్ గ్రా మానికి చెందిన మన్నె వెంకటేష్‌గా గుర్తించి చోరీ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో కృషిచేసిన పోలీస్ బృందం నారాయణ, లింగమూర్తి, ఆంజనేయులు, రాములు, యాదయ్య, మల్లేష్, రాజుగౌడ్‌లను డీఎస్పీ అభినందించి, నగదు రివార్డును అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎన్.లింగయ్య

విషజ్వరాల బారిన మాడాపూర్ గ్రామస్థులు

- ప్రతీ ఇంట్లో వ్యాధిగ్రస్తులు
- ఆసుపత్రుల బాట పడుతున్న జనం

లింగాల, ఆగస్టు 10 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం సురాపూర్ గ్రామ పంచాయతీలోని మాడాపూర్ గ్రామంలో విష జ్వరాలతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలోని ఏ ఇంట్లో చూసినా వ్యాధి సోకిన వారు కన్పిస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం జ్వరంతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను 108లో లింగాల పీహెచ్‌సీకి తరలించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గత మొహర్రం నుంచి తాము రోగాలతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 120 ఇళ్లల్లో 600 మంది జనాభా ఉన్నామని తెలిపారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువైందని, దాంతో వ్యాధులు సోకడంపై ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. జ్వరాల బారిన పడిన చిన్నారులను నీలోఫర్ ఆసుపత్రికి తరలించిన ఘటనలు ఉన్నాయన్నారు.


చికిత్స కోసం అంబులెన్స్‌లో వెళ్తున్న రోగులు


తమ ఇద్దరు పిల్లలకు చికిత్స చేయించుకొని ఇంటికి తీసుకొస్తున్న తల్లిదండ్రులు

వ్యాధులతో ఇబ్బంది పడుతున్నాం..



గ్రామంలో కొన్నిరోజులుగా రోగాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కావడం లేదు. గ్రామంలో దోమల నివారణకు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి.

- శ్రీరాములు

పిల్లలతో పాటు, అత్తమామలకు జ్వరాలు వస్తున్నాయి..



తన ఇద్దరు పిల్లలతో పాటు, అత్తమామ జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతీరోజు అందరం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. అయినప్పటికీ నయం కావడం లేదు. గ్రామంలో తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

- జహంగీర్‌బీ

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణ

» బుద్ధతండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



గిరిజన సంప్రదాయ తలపాగాతో ఎమ్మెల్యే

అచ్చంపేట, ఆగస్టు 10 : గిరిజనులు తొమ్మిదిరోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకునే తీజ్ ఉత్సవాల చివరి రోజైన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బుద్ధతండాలో ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులతో గిరిజన యువతులు తీజ్ బుట్టలను ఎత్తుకొని నిమజ్జనానికి వెళ్లారు. ఉత్సవ నాయకుల ఆధ్వర్యంలో గిరిజనులు వివిధ వేషధారణలో ఉత్సవాలకు హాజరై డప్పు నృత్యాల మధ్య వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరయ్యారు. గిరిజన నాయకులు ఆయనకు సంప్రదాయ తలపాగా చుట్టి గవ్వలతో తయారుచేసిన దండను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరినీ ఒక చోటకు చేర్చే ఉత్సవాలను నిర్వహించడం వల్ల ఐక్యత పెరుగుతుందన్నారు. తీజ్ ఉత్సవాల సందర్భంగా బంధుమిత్రులతో తండా కళకళలాడింది.

కొంగొత్తగా కొన్నూరు

» గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు

» మన ఊరు, మన బడికి పారిశ్రామిక వేత్త సహకారం

» గ్రామాభివృద్ధిలో కీలకంగా శరత్‌రెడ్డి

మదనాపురం, ఆగస్టు 10 : వనపర్తి జిల్లా కొన్నూరు కొంగొత్తగా రూపుదిద్దుకుంటోంది. గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఆ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త శరత్‌రెడ్డి పూనుకున్నారు. ముఖ్యంగా గ్రామంలోని పాఠశాలను పునర్నిర్మించేందుకు గాను ప్రభుత్వం కేటాయించిన రూ.65 లక్షలు కాకుండా శరత్‌రెడ్డి సొంతంగా తన నిధులను వెచ్చిస్తున్నారు.



కొన్నూరులో ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాల

ఊరికి సేవ చేయడంలోనే సంతృప్తి



మనం ఎంత సంపాదించినా అది వేరే వారికి ఉపయోగపడనప్పుడు అదంతా వృథానే. గ్రామంలో విద్యార్థులు బాగా చదువుకొని ఎదగాలన్నదే నా ఆశయం. అది నెరవేరాలంటే వసతులు అవసరం. అదేవిధంగా గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలకు అవసరమయ్యే భవనాలు ఉంటే అధికారులు వస్తారు. దీని కోసం నా వంతు సహాయం చేస్తున్నా.

- శరత్‌రెడ్డి, కొన్నూరు

దాదాపు రూ.కోటి 15 లక్షలు వెచ్చించి పాఠశాలలో పది నూతన తరగతులతో పాటు ఒక మీటింగ్ హాల్, డైనింగ్ హాల్, పది బాత్‌రూంలు ఉండే విధంగా నిర్మాణాన్ని పూర్తి చేయించారు. అంతేకాకుండా గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌కు అదనంగా రూ.ఐదు లక్షలు, పంచాయతీ భవనానికి రూ.రెండు, వెటర్నరీ సెంటర్‌కు రూ.ఎనిమిది లక్షలు కేటాయించి పూర్తిగా నిర్మాణం చేశారు. పూర్తయిన నిర్మాణాల ప్రారంభోత్సవానికి ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ్మా, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డిలు రానున్నారు.

ప్రమాదం కేసును ఛేదించడంలో జాప్యమెందుకు?

» పక్కదారి పట్టిన మార్కెట్‌యార్డు గోదాం అగ్నిప్రమాదం కేసు

» రూ.10 కోట్ల ప్రజాధనం అగ్నికి ఆహుతి

» పట్టించుకోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు

పెబ్బేరు, ఆగస్టు 10 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ అగ్ని ప్రమాదం కేసును ఛేదించడంలో పోలీసులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఏప్రిల్ ఒకటో తేదీన వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని గోదాంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి రూ.10 కోట్ల ప్రజాధనం అగ్నికి ఆహుతి అయింది. కానీ నేటికీ ఆ అగ్ని ప్రమాదానికి గల కారణాలు పోలీసులు కానీ, వ్యవసాయ శాఖ అధికారులు గానీ, ప్రత్యేక విచారణ అధికారుల బృందం కానీ కనుక్కోలేకపోయింది. గోదాంలో 12 లక్షల 80 వేల గన్నీ బ్యాగులు, దాదాపు రూ.40 వేల వరి ధాన్యం దగ్ధమైంది. గోదాం భవనం కూలిపోయింది. పదిరోజుల పాటు మండుతూనే గన్నీ బ్యాగులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది పదిరోజుల పాటు శ్రమించింది. నాలుగు మాసాల



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి



పెబ్బేరులోని గోదాంలో అగ్ని ప్రమాదం (ఫైల్)

పదిరోజులు గడుస్తున్నా ఇంతవరకు అగ్ని ప్రమాదానికి గల కారణాలను వెల్లడించలేదు. మారిన టెక్నాలజీ కాలంలో కూడా నిందితులను గుర్తించలేకపోయారు. ప్రభుత్వ ఆస్తులను దగ్ధం చేసిన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యాయరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారకులైన వారిని గుర్తించి శిక్ష పడేలా చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విచారణ బృందం పర్యటించినప్పటికీ విషయాలు బయటికి రాలేదు. రాజకీయ నాయకుల ప్రమేయంతోనే కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

నివేదికను డీఎస్పీ కార్యాలయానికి పంపాం : సీఐ రాంబాబు

అగ్ని ప్రమాద కేసు విచారణ పూర్తిచేసి నివేదికను వనపర్తి డీఎస్పీ కార్యాలయంలో సమర్పించాం. డీఎస్పీ నుంచి ఎస్పీ, కలెక్టర్‌కు నివేదిక వెళ్తుంది.

కవిత్వం సామాజిక చైతన్యాన్ని పెంచుతుంది

» ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 10 : కవిత్వం అనేది సామాజిక చైతన్యం, బాధ్యతను పెంచుతుందని ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కవిత్వ నిర్మాణంపై రెండురోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. నెలపొడుపు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి పి.వహీద్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ కవి సీతారం ముఖ్య అతిథిగా హాజరై, ప్రసంగించారు. కవిత్వం సమాజంలో మార్పును తెస్తుందన్నారు. ఉన్మాదాలు, ఉత్పాతాలు, దోపిడీ నుంచి మూఢాచారాల నుంచి చైతన్యం చేసేదే కవిత్వమని పేర్కొన్నారు. శ్రామిక, సామాజిక చైతన్యంలో కవిత్వం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఆదివారం రెండో రోజు నిర్వహించే వర్క్‌షాప్‌కు కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, కేంద్ర సైట్ అకాడమీ యువ పురస్కార



కవి, విమర్శకులు సీతారాంను సన్మానిస్తున్న నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సభ్యులు

గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, కవులు కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, నీరటి బాలీశ్వర్, నాగవరం బాల్‌రాం, కోట్ల గౌతమ్, జయప్రకాష్, విజయ్‌కాంత్, గడ్డంపల్లి భూపాల్‌రెడ్డి, గౌస్‌పాష, దేవదానం, గఫార్, చిక్కొండ్ర రవి తదితరులున్నారు.

ప్రేమ పేరుతో చనువు

» పెళ్లి మాటెత్తితే దాడి, బెదిరింపులు

» యువకుడిపై పోలీసులకు గిరిజన యువతి ఫిర్యాదు

నవాబ్‌పేట, ఆగస్టు 10 : తనను ప్రేమ పేరుతో లోబరచుకొని గర్భం దాల్చగా అబార్షన్ చేయించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీరా మోసం చేశాడని ఆరోపిస్తు ఓ గిరిజన యువతి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలోని ఓ తండాకు చెందిన యువతి (22) హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో చదువుకుంటోంది. ఈమెకు నవాబ్‌పేటకు చెందిన షేక్ ముస్తఫా అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో చనువుగా ఉంటూ ఆమెను లోబర్చుకుని గర్భవతిని చేశాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ ఆసుపత్రిలో గతేడాది సెప్టెంబర్ నెలలో అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకోవాలంటే మతం అడ్డు వస్తుందని చెప్పి దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడు. తనను మోసం చేసిన షేక్ ముస్తఫా, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



ఉప్పరి పరమేశు (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 10 : ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి చెందిన సంఘటన కర్నూలు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామానికి చెందిన ఉప్పరి పరమేశు(30) గ్రామం నుంచి కర్నూలుకు ట్రాక్టర్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

అలంపూరు, ఆగస్టు 10 : అత్తమామ వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలం లింగనవాయి గ్రామానికి చెందిన మాధవి(27) అత్తమామ వేధింపులతో గతవారం గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. చికిత్స సమయంలో మాధవి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..

ఉప్పునుంతల, ఆగస్టు 10 : విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం అయ్యవారిపల్లితండాలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రామవత్‌సత్రాం శనివారం ఉదయం తన వ్యవసాయ పొలంలో ఉన్న పాడి ఆవుకు ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ ఊరిళ కోరారు.

ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీ

» బస్ డ్రైవర్‌కు గాయాలు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 10 : ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని వైజంక్షన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట డిపోకు చెందిన బస్సు అచ్చంపేట నుంచి దేవరకొండకు వెళ్తుండగా పట్టణ సమీపంలోని వైజంక్షన్‌లో చారకొండ మండలానికి చెందిన బొలెరో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో బొలెరో నుజ్జునుజ్జయ్యింది. బొలెరో డ్రైవర్ కొప్పెర మహేష్‌కు స్వల్ప గాయాలు కాగా, బస్ డ్రైవర్ శేఖర్ కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

» భూమి రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 10 : తన భూమిని మాయమాటలతో రిజిస్ట్రేషన్ చేసుకుని సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన రైతు కత్తె మల్లేష్ గ్రామ చివరన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని వనపట్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వనపట్ల గ్రామానికి చెందిన కత్తె రాములు, కత్తె మల్లేష్, కత్తె జ్యోతి ముగ్గురు ఒకే కుటుంబ సభ్యులు. వీరి పేరున గ్రామ శివారులో 135 సర్వే నెంబరులో నాలుగు ఎకరాల 38 గుంటల భూమి ఉండడంతో అట్టి భూమిని వనపట్ల గ్రామ మాజీ సర్పంచ్ మన్యపురెడ్డి, కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డి, నర్సాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త రామకృష్ణారెడ్డిలు తమ భూమిని కొనుగోలు చేసేందుకు ఒక ఎకరాకు రూ.కోటి 36 లక్షలుగా ధర ఖరారు చేసుకుని రూ.రెండు కోట్ల 32 లక్షలు నగదు చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నారు. మిగతా డబ్బులు సంవత్సరంలోపల ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుంటామని ఒప్పందం చేసుకున్నారు. డీటీసీపీ అప్రూవల్ తెచ్చుకుని పది శాతం గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలని వారికి మాయమాటలు చెప్పి మొత్తం భూమిని మాజీ సర్పంచ్ మన్యపురెడ్డి సాక్షిగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం రైతులకు తెలియకుండా మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం తెలిసిన రైతులు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఎలాంటి న్యాయం జరగకపోవడంతో మనస్తాపానికి గురైన కత్తె మల్లేష్ గ్రామ చివరన చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన గ్రామస్థులు అతన్ని చూసి కాపాడి జిల్లా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. 48 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించారు. ఇంకా తనకు రావాల్సిన రూ.నాలుగు కోట్ల 41లక్షలు ఇప్పించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లేష్

ఒరిగిన స్తంభంతో పొంచి ఉన్న ప్రమాదం

బిజినేపల్లి, ఆగస్టు 10 : నిత్యం వాహనాల రాకపోకలతో పాటు వ్యవసాయ పొలాలకు రైతులు తిరిగే ప్రధాన రహదారిపై ప్రమాదభరితంగా 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం సగానికి వాలి ఉండడంతో పెను ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిజినేపల్లి మండలం గంగారం - లట్టుపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పోలేపల్లి తండా సమీపంలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం పదిరోజుల క్రితం గాలివానలకు ఒరిగింది. స్తంభం ప్రమాదభరితంగా ఒరిగిందని చుట్టుపక్కల ఉన్న రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా ఇప్పటివరకు ఒరిగిన స్తంభాన్ని సరి చేయకపోవడంతో ఎప్పుడు స్తంభం కింద పడి జరగరాని ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ఉన్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే విద్యుత్ లైన్‌ను వేసేందుకు కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ స్తంభాలు నాటేందుకు గుంతలు తక్కువ లోతు తీయడంతో పాటు, నాసిరకం విద్యుత్ స్తంభాలు, వైర్లు తీసుకొచ్చి ఆదరబాదరగా పనులు చేశాడని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. వాలిన స్తంభంతో పాటు ఆ విద్యుత్ లైన్ అంతా కూడా తిరిగి నాణ్యతగా వేయించి ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరుతున్నారు. అంతేకాకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విద్యుత్ లైన్‌ను వేసిన సంబంధిత కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, రికవరీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లే పెద్దలైన్ విద్యుత్ వైర్లు కావడంతో రోడ్డుపై స్తంభం పడి ప్రాణ నష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



లట్టుపల్లి నుంచి గంగారం వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదభరితంగా వాలిన 33 కేవీ విద్యుత్ లైన్ స్తంభం

అభయుడి ఆలయంలో భక్తుల సందడి



ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

ఊర్కొండ, ఆగస్టు 10: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. వచ్చిన భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. సామూహిక వ్రతాలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు. అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, మహేష్ శర్మ, శ్రీనివాస శర్మ, ఆలయ సిబ్బంది మారుతి, శ్రీశైలం, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఘనంగా దర్వేష్ ఆలీషా ఖాద్రి ఉర్సు ఉత్సవాలు



జటప్రోలు దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

పెంట్లవెల్లి, ఆగస్టు 10: మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో శుక్రవారం రాత్రి ధర్వేష్ ఆలీషా ఖాద్రీ గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి గంధోత్సవం మదన గోపాలస్వామి ఆలయం నుంచి ర్యాలీగా దర్వేష్ ఆలీషా ఖాద్రీ దర్గా దగ్గరికి భక్తులు వచ్చి గంధాన్ని దర్గా పీఠాధిపతి సయ్యద్ బురనుద్దీన్ ఖాద్రీకి సమర్పించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థన చేశారు. రెండో గంధం జామే మసీదు నుంచి ధర్వేష్ ఆలీషా ఖాద్రి దర్గా దగ్గరికి భక్తులు గంధం ఇచ్చారు. మత సామరస్యానికి నిదర్శనంగా చెప్పుకునే ఈ దర్గాకు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక మొలకల పండుగ



జేపీనగర్‌లో మొలకల పండుగను ప్రారంభిస్తున్న బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, ఆగస్టు 10 : గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు మొలకల పండుగ ప్రత్యేకంగా నిలుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తెలిపారు. పెళ్లి కాని గిరిజన యువతులు 9రోజుల పాటు నిష్టతో బుట్టల్లో వేసిన గింజలకు నీళ్ల పోసి పెంచుతారని ఇది ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని జయప్రకాశ్‌నగర్‌తండాలో మొలకల పండుగ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. మట్టికి ప్రత్యేక పూజలు చేసి బుట్టిల్లో మట్టిని ధాన్యాలను నింపి మంచే మీద పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లెల రాములు, కౌన్సిలర్ హామ్లీ, హన్మనాయక్, దేవిలాల్‌చౌహాన్, రవిగౌడ్, పలువురు గిరిజన సంఘం నాయకులు, తండావాసులు తదితరులు ఉన్నారు.

జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలి



అంతర్గత రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం బృందం

చారకొండ, ఆగస్టు 10: మండలంలోని జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు గుంతల మయంగా మారిన మట్టి రోడ్డును బీటి రోడ్డుగా మార్చాలని సీపీఎం మండల కార్యదర్శి బండపల్లి బాలస్వామి అన్నారు. మండలంలోని జూపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు అంతర్గత రోడ్లు, జూపల్లి నుంచి వంగూరు గేట్ వరకు ఉన్న మట్టిరోడ్డు అస్తవ్యస్తంగా మారాయి. దాంతో గ్రామాల్లో సర్వే చేపట్టిన సీపీఎం బృందం దృష్టికి జూపల్లిలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే సంబంధిత ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని కోరారు. వారివెంట నాయకులు ఎల్క శ్రీను, మధు, పెంటయ్య, గెల్వయ్య, బుచ్చిరాములు, ఎల్లయ్య, రాములు గ్రామస్థులున్నారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వరస్వామికి తైలాభిషేకాలు

బిజినేపల్లి, ఆగస్టు 10 : మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం నాడు పూజించాలని సూచించారు. శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుంది



జాతీయ జెండాలతో సుధాకర్‌రెడ్డి తదితరులు

ఉప్పునుంతల, ఆగస్టు 10: స్థానిక సంస్థలలో అన్ని స్థానాలలో బీజేపీ పోటీ చేస్తుందని రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉప్పునుంతలలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు నరేంద్రరరావు, దుర్గాప్రసాద్, సైదులు, మహేష్, రమేష్, బ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చారకొండ, ఆగస్టు 10: మండల కేంద్రానికి చెందిన కుంభం రామస్వామి ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడి కుడికాలు విరిగింది. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొన్న బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి లావణ్య శనివారం కుంభం రామస్వామిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనం తరం శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామస్వామికి ఆర్థిక సహాయం రూ. 10 వేలు అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు మొగిళ్ల కన్నా, బీజేవైఎం మండల కార్యదర్శి సురకారపు అనిల్‌గౌడ్, బోయినిపల్లి ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు

- అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కల్వకోల్ బీసీ కాలనీలో అంతర్గత రహదారిపై చేరిన మురుగు నీరు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 10 : గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన వెదజల్లుతోందని భరించలేకపోతున్నామని అంటున్నారు. దీంతో దోమల బెడద అధికమవుతున్నదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వకోల్ గ్రామంలో సీసీ రోడ్లు లేకపోవడంతో అంతర్గత రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి మురుగునీరు చేరింది. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దేవునితిర్మలాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు వేసిన సైడ్ డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరుతున్నది. దాంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సాతాపూర్, గంట్రావుపల్లి, చంద్రకల్ తదితర గ్రామాలల్లో పారిశుద్ధ్యం లోపించింది. మురుగునీరు అంతర్గత రహదారులపై చేరి దుర్వాసన వెదజల్లుతున్నది. ఆయా గ్రామాల్లో రోడ్లపై చేరుతున్న మురుగు నీటిలో ఈగలు, దోమలు ఆవాసాలుగా ఏర్పరుచుకున్నాయి. రాత్రివేళ దోమలు కుట్టడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దోమకాటుకు గురైన వారు విష జ్వరాల బారిన పడుతున్నారు.

ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శిస్తున్నారు.

ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడం మూలంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు.

ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



ప్రస్తుత సీజన్‌లో వర్షాల కారణంగా గ్రామంలో అంతర్గత రహదారులపై మురుగునీరు చేరుతున్నది. రహదారులు అధ్వానంగా మారి మురుగునీటిపై ఈగలు, దోమలు చేరుతున్నాయి. అధ్వానం గా మారి ప్రజలను ఇబ్బందులకు గురవుతున్నారు. పంచా యతీ కార్యదర్శులు దృష్టి సారించి గ్రామాల్లో అంతర్గత రహదారులపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలి.

\- పెద్దేటి విజేయుడు, కల్వకోల్

ఘనంగా మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు

- తలసేమియా బాధితులకు జూపల్లి అభిమానుల రక్తదానం
- మహిళలకు దుస్తుల పంపిణీ



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలో భాగంగా కేక్ కట్ చేస్తున్న జూపల్లి అరుణ్, మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య

కొల్లాపూర్, ఆగస్టు 10 : రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను కొల్లాపూర్ మండలంలో కాంగ్రెస్ శ్రేణులు, మంత్రి జూపల్లి అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి తనయుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు జూపల్లి అరుణ్, మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య, మునిసిపల్ కౌన్సిలర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా తలసేమియా బాధితులకు మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వంగ రాజశేఖర్ గౌడ్, కిరణ్‌తేజగౌడ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మంత్రి జూపల్లి అభిమానులు దాదాపు 50మంది దాకా తలసేమియా బాధితులకు రక్తదానం చేశారు. మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం, కౌన్సిలర్లు సిబ్బంది నరసింహారావు, షేక్.రహీంపాషా, ఎండి.నయీమ్, బరిగెల రాముడు, బొరెల్లి కరుణమ్మ, కర్నె అలివేలు, సింగిల్ విండో డైరెక్టర్ పస్పుల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల నాగరాజు, ఎండి.ఎక్బాల్, కేతూరి ధర్మతేజ, మద్దెల రాందాస్, బొరెల్లి మహేష్, ఖాదర్‌పాష రెడ్డి సత్యం, పసుల వెంకటేశ్, బరిగెల వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

● మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలను పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. అనంతరం పేద మహిళలకు దుస్తులు, చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు మేకల నాగరాజు, రెడ్డి సత్యం, బరిగెల సత్యనారాయణ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● వరిదెల షమీ వృక్షం వద్ద సంబురాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని వరిదెల షమీ వృక్షం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.సురేందర్‌సింగ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల కేక్‌ను మునిసిపల్ కౌన్సిలర్ మేకల శిరీష, నాయకులు కట్ చేశారు. జూపల్లి జన్మదినం సందర్భంగా వార్డులోని నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. మునిసిపల్ కౌన్సిలర్ మేకల శిరీష, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌సింగ్, ఎండి. ఎక్బాల్, కృష్ణమనాయుడు, మేల కిరణ్‌యాదవ్, మేకల కిశోర్‌యాదవ్, గనమోని శేఖర్, మేకల రాముడు, సునీత, రమేష్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లి అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య పార్టీ శ్రేణులు కేక్ తినిపించుకున్నారు. అనంతరం పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మాజీ ఎంపీపీలు సూర్యప్రతాప్‌గౌడ్, దండు నరసింహ, మాజీ సర్పంచ్ రాంలాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల చంద్రయ్య రక్తదానం చేశారు. అనంతరం పెద్దకొత్తపల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ చైర్మన్ మెరుగురాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ ఎంపీటీసీలు దండు నరసింహ, బద్యనాయక్, రవికుమార్, మాజీ సర్పంచ్ రాంలాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, నాయకులు దండు చంద్రయ్య, మేకల చంద్రయ్య, శివరాజేశ్వర్‌రావు, చంద్రశేఖర్, డబ్బ ఎల్లయ్య, కొల్లే ఈశ్వర్, నాగరాజు, మల్లయ్య, శివశంకర్, చిత్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి



అయ్యవారిపల్లిలో వర్షం నీరు

ఉప్పునుంతల, ఆగస్టు 10: వారం రోజులుగా మండలంలో చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఇంటి పరిసరాలతో పాటు రోడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. కార్యక్రమాలు ఫొటోలకే పరిమి తం అయ్యాయి తప్పా ఎక్కడ కూడా పూర్తి స్వచ్ఛదనం కనిపించడంలేదని ప్రతిపక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీలలో పేరు కపోయి చెత్తాచెదారం తొలగించవల్సిన అవసరం ఉంది. కనీసం బ్లీచింగ్ పౌడర్ సరఫరా చేయకపోవడం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నా రు. సర్పంచ్‌లు లేకపోవడం ఇటీవల చేపట్టిన బదిల్లో కొత్తగా వచ్చిన ప్రచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో పట్టులేకపోవడం వల్ల కార్యక్రమం అంతగా అమలు కాలేదన వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు కావల్సిన దోమల నివారణ చర్యలతో పాటు బ్లీచింగ్ పౌడర్ అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకు మరిన్ని పథకాలను చేరువ చేస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, ఆగస్టు 10 : పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమావేశపు హాలులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమం, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. జడ్పీటీసీ సుమిత్ర, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మాజీ సర్పంచ్‌లు నరేందర్‌గౌడ్, బాలగౌడ్, మండల పార్టీ నాయకులు శివారెడ్డి, ఉమాదేవి, యువజన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందేలా చూడాలి

తిమ్మాజిపేట: ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట రైతు వేదికలో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వివిధ గ్రామాలకు చెందిన 55మంది లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్రామిరెడ్డి, మల్లయ్యగౌడ్, శ్రీనివాస్ బహదూర్, బాలరాజు, మాధవులు, ఉస్మాన్‌రవూఫ్, లక్ష్మీనారాయణ, వివేక్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భాస్కర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, మనోహర్, నాగసాయిలు, హర్షవర్ధన్‌రెడ్డి, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

- 8 తులాల బంగారం, లక్ష నగదు స్వాధీనం



విలేకర్లతో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 10 : దొంగతనం కేసులో 8తులాల బంగారం, దాదాపు ఒక కేజీ 470 గ్రాముల వెండితోపాటు లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 9దొంగతనాల కేసులో దాదాపు 8తులాల బంగారం, ఒక కేజీ 470 గ్రాముల వెండితోపాటు లక్ష రూపాయలు నగదును పోలీసులు స్వాధీనపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులు అచ్చంపేట పట్టణంలో మార్కెట్‌యార్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అచ్చంపేట సీఐ జి.రవీందర్, ఎస్ఐ రాము తమ సిబ్బందితో పట్టుకుని విచారించారు. గత కొన్ని నెలలుగా అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల్లో ఉదయం, రాత్రివేళల్లో తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడినట్లు వారు నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ నేరస్తులు మోటమరి వినోద్‌కుమార్, మాండ్ల శివ ఇద్దరు చిన్ననాటి స్నేహితులుగా ఉండి దుర్వ్యసనాలకు అలవాటై మొదట్లో హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిధిలో కొన్ని కేసులు నమోదయ్యాయి. అక్కడి కేసుల్లో జైలు జీవితం గడిపి విడుదలైన తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దొంగతనాలకు పాల్పడిన నిందితులను పట్టుకుని చాకచక్యంగా సొమ్మును రికవరీ చేసిన అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ రాము, పోలీస్ సిబ్బందికి నగదు రివార్డు అందించి అభినందించారు.

అస్తమించిన ఎర్ర సూరీడు రాంచంద్రరావు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ



రాంచంద్రరావు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 10: సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సుదీర్ఘకాలం పాటు ఆఫీసు కార్యదర్శి, కోశాధికారిగా పని చేసిన డీ.ఎస్.రాంచంద్రరావు అస్తమించిన ఎర్ర సూరీడని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన డీఎస్.రాంచంద్రరావు చిత్ర పటానికి జిల్లా కమిటీ సభ్యులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్‌జీ మాట్లాడుతూ మరణించిన తర్వాత కూడా తన పార్థీవదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వాలని ముందే నిర్ణయించుకున్న ఆదర్శ కమ్యునిస్టు నాయకుడు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపిచారి, కొత్త శేఖర్, రామస్వామి, నాగయ్య, శ్రీనివాసులు, బాలపీరు, ప్రకాష్, ఆంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 10: మరమ్మతుల కారణంగా పట్టణంలోని రాంనగర్ కాలనీ, పాత మార్కెట్ యార్డు, రామకృష్ణ టాకీస్, పుల్లారెడ్డి హాస్పిటల్, సంతబజారు, బస్ డిపో, ట్యాంక్ బండ్, ఎండబెట్ల తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వి ద్యుత్ శాఖ ఏఈ కృష్ణగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టణంలోని ఆయా ప్రాంతాల ప్రజల విషయం గమనించి విద్యుత్ శాఖకు సహకరించగలరని ఆయన కోరారు.

13న ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

కొల్లాపూర్, ఆగస్టు 10: హైదరాబాద్ మహానగరంలో ఎస్సీ వర్గీకరణ సాధించిన రథసారథతి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఈ నెల 13న స్వాగతం పలుకుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు మీసాల గణేష్‌మాదిగ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్ల తో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సుప్రీంకోర్టు ద్వారా విజయాన్ని సాధించుకుని మొదటిసారి తెలుగు నేలపై అడుగు పెడుతున్న మందకృష్ణను శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఘనంగా స్వాగతం పలికి మహానగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు, హరీష్, శ్రావణ్ పాల్గొన్నారు.

జూపల్లిలో ప్రాథమిక సహకారం సంఘాన్ని ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చారకొండ, ఆగస్టు 10: మండల పరిధిలోని జూపల్లిలో ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్)ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని జూపల్లి గ్రామస్థులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జూపల్లి, ఎర్రవల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, శేరిఅపారెడ్డిపల్లి గ్రామాల ఓటర్లు, నలుగురు డైరెక్టర్లు అర్హులుగా ఉన్నారని పీఏసీఎస్ వెల్దండలో ఉండటం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జూపల్లిలో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో చారకొండ పీఏసీఎస్‌లో విలీనం చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని జూపల్లి వెంకటయ్యయాదవ్ తెలిపారు. బాత్క జంగయ్య కడారి సుల్తాన్, ఎల్క రామచంద్రి, కొక్కరి లింగం, దేవేందర్, అక్కి శ్రీనివాస్ గౌడ్, వెంకటయ్య గౌడ్, చింతకుంట్ల రామస్వామి, జయందర్, మాధవరెడ్డి, లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 10 : ఉపాధ్యాయులు సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్న యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు నెహ్రూ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి యూటీఎఫ్ చరిత్రను తెలియాజేశారు. యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వవిద్యారంగా అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని, హక్కులు బాధ్యతలు రెండు కళ్లుగా భావించి అన్యాయాన్ని ఎదురించి న్యాయంవైపు నిలిచిపోరాడుతుందని వారు వివరించారు. యూటీఎఫ్ సామాజిక అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించిందని వక్తలు వివరించారు. విశ్రాంత ఉద్యోగులు రాధాకృష్ణ, లక్ష్మణమూర్తి, రాష్ట్ర నాయకులు చిన్నయ్య, లింగమయ్య, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, కృష్ణ గౌడు, ఎల్లయ్య, మహేష్, వెంకటేశ్వర్‌గౌడు, నరేష్, నరసింహులు, జంగయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువకుడికి ఉపాధి కల్పించిన బీజేపీ నాయకుడు

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 10 : మునిసిపాలిటీ పరిధిలోని ఇంది రానగర్ కాలనీకి చెందిన మురళీకృష్ణ ఇటీవల ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నాడు. విషయాన్ని గమనించిన బీజేపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి ఇందిరానగర్ కాలనీవాసులతో వివరాలు తెలుసుకుని శనివారం ఆ యువకునికి ఆర్థికసాయంచేశారు. మిల్క్‌సెంటర్‌ను ఏర్పాటుచేయించి ప్రారంభించారు. ఉపాధిలేని యువకునికి సాయం అందించినందుకు కాలనీవాసులు అభినందించారు. బీజేపీ నాయకులు శేఖర్‌రెడ్డి, గంగాదర్, సంతోష్, శేఖర్, శ్రీనివాసులు, గణేష్, శివ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు మద్యం గోదాం కార్మికుల సహాయం

తిమ్మాజిపేట, ఆగస్టు 10 : కేరళ రాష్ట్రంలో దీనావస్థలో బిక్కుబిక్కుమని గడుపుతున్న వయనాడ్ ప్రజలకు చేదోడువాదోడుగా ఉండేందుకు ఏఐటీయూసీ జాతీయసమితి పిలుపు మేరకు తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఉన్న మద్యం గోదాం డిపో హమాలీ కార్మిక నాయకులు రూ.10 వేల సహాయం సేకరించారు. దీనిని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాలరాజుకు అందించినట్లు శేఖర్, మధు, జీవన్ తెలిపారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

తిమ్మాజిపేట, ఆగస్టు 10 : తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం లైఫ్ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా శిబిరంలో దాదాపు 200మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. మరికొందరికి శస్త్ర చికిత్సలు అవసరం ఉందని గుర్తించారు. వైద్యులు డాక్టర్ చంద్రారెడ్డి, డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కండ్లు బాగుంటేనే ఏ పని అయినా చేసుకోగలమని అందు కోసం ప్రతీ వ్యక్తి తమ కళ్లను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. వైద్యం ఎంతో ఖరీదుతో కూడుకున్నదని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు సిబ్బంది మాధవి, సునీతలు గ్రామంలో తిరుగుతూ ప్రజలకు కంటి వైద్య శిబిరం ఏర్పాటుపై సమా చారమందిస్తూ అవగాహన కల్పించారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

కల్వకుర్తి, ఆగస్టు 10 : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆలిండియా క్రైస్తవ ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, ఆనంద్, ఇజ్రాయేల్, దాస్‌లు డిమాండ్ చేశారు. ఆలిండియా క్రైస్తవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్రైస్తవులను ఎస్సీలలో కలపాలని నిర్వహించే నిరసన సభకు కల్వకుర్తి నుంచి శనివారం పలువురు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్‌ను మానవత్వంతో గుర్తించి ఎస్సీ హోదా కల్పించాలని వారు కోరారు.

పాడి రైతులకు బిల్లులు చెల్లించాలి

వంగూరు, ఆగస్టు 10: రాష్ట్రంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్యకి పాలను విక్రయిస్తున్న రైతులకు సకాలంలో చెల్లింపులు జరుగక ఇబ్బందులు పడు తున్నారని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకుడు శివరాములు అన్నారు. శనివారం వంగూరులో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతీ 15 రోజులకోసారి చెల్లింపు లు జరుగవల్సి ఉండగా గత 45 రోజులుగా అవి నిలిచి పోయాయని, దీంతో రై తులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని ఆయన పేర్నొన్నారు. వెంటనే బిల్లుల చెల్లింపులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.